క్లుప్తంగా

ముగిసిన ఆలయ పునః ప్రతిష్ట



పూజలందుకుంటున్న కాళీమాత అమ్మవారు

ఇచ్ఛాపురం: పట్టణంలోని దక్షిణ కాళీమాత ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా ముగిసింది. పాత బజారు వీధి 7, 8 వార్డులు డబ్బూరివీధి కూడలిలో నిర్మించిన ఆలయం పునః ప్రతిష్ట కార్యక్రమం అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ అధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అప్రమత్తత అవసరం

టెక్కలి: దంతాల సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని దంత వైద్య నిపుణుడు బాలప్రసాద్, అనీషా సూచించారు. జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, అధ్యాపకులు బి.సతీష్‌కుమార్, ల్యూక్‌పాల్, రమణమూర్తి, లక్ష్మణరావు, శివాజీ, హరి, తరుణ్, కరువయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా గెలిపించండి'

టెక్కలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న తనను గెలిపించాలని పీవీఎన్ మాధవ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో బుధవారం ప్రచారం చేశారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు ఎ.రవిబాబ్జి, బి.నరేంద్ర, ఎన్.లక్ష్మీనారాయణ, రామ్‌జీ, లింగరాజు, కామరాజు, జగన్నాథం, శ్రీకృష్ణదేవరాయ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

సోంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992–93వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న కొమ్మూరి చంద్రమోహన్ ఇటీవల తెనాలిలో అనారోగ్యంతో మృతి చెందాడు. వాళ్ల కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో ఆయనతో చదువుకున్న స్నేహితులు అండగా నిలిచారు. అందరూ కలిసి రూ.1,02,000 సమకూర్చి తెనాలిలో ఉన్న కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఈపరి రవికుమార్, టంకాల ప్రవీణ్, తూముల మధు పాల్గొన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయాలి

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

కోటబొమ్మాళి: జగనన్న శాశ్వత భూహక్కు సర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలతో భూసర్వే పురోగతిపై గ్రామాల వారీగా బుధవారం సమీక్ష నిర్వహించారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేసేందుకు ప్రతీ అధికారి కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, డివిజనల్ సర్వేయర్ మామిడి జనార్దనరావు, సూపరింటెండెంట్ మధు, ఆర్‌ఐ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్థికాభివృద్ధి సాధించాలి'

ఇచ్ఛాపురం రూరల్: స్వయం శక్తి సంఘాల బ్యాంక్ ఖాతాల్లో పొదుపు నిధులను సంఘ సభ్యులు ఆర్థికాభివృద్ధికి వినియోగించాలని వెలుగు ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల మహిళ సమైఖ్య భవనంలో సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు, వీవోలు పాల్గొన్నారు.

కరుణించు.. ఎల్లమ్మా



సంతబొమ్మాళి: భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి



మందస: జామి జాతరకు పోటెత్తిన భక్తులు



ఇచ్ఛాపురం: ఎల్లమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



సంతబొమ్మాళి: జనసంద్రంగా ఎల్లమ్మ తల్లి జాతర



కంచిలి: జాడుపూడిలో పుట్టకు మొక్కుతున్న భక్తులు



కాశీబుగ్గ: అన్నదానం ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కాశీబుగ్గ: జాతరలో కిక్కిరిసిన జనాలు



కాశీబుగ్గ: మజ్జిగ పంపిణీ చేస్తున్న మాజీ సైనికులు



ఇచ్ఛాపురం రూరల్: ఎల్లమ్మ తల్లి జంగిడి ఊరేగిస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం: ఎల్లమ్మ గుడి వద్ద బారులుతీరిన భక్తులు



కాశీబుగ్గ: ఎన్‌సీసీ క్యాడెట్ల సేవా కార్యక్రమాలు



కాశీబుగ్గ: దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

జామి ఎల్లమ్మ జాతరను ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. పుట్టకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలాసలో జరిగిన జామి యాత్రకు సుమారు లక్షమంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు పలాస కాష్యూ మ్యానిఫ్యాక్చర్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన భోజన సౌకర్యాలను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. అలాగే ఇచ్ఛాపురం పట్టణంలో, మందస మండలంలోని మూలిపాడు పంచాయతీ గోపాలపురం-శ్రీనివాసపురంలో, సంతబొమ్మాళి మండలంలోని మర్రిపాడులో, వజ్రపుకొత్తూరు రూరల్ మండలంలోని బైపల్లి, అక్కుపల్లి, బెండి గ్రామాల్లో, ఇచ్ఛాపురం రూరల్ మండలంలోని ఈదురపురం, దొంకూరు, బిర్లంగి, కేదారపురం గ్రామాల్లో, కంచిలి మండలంలోని జాడుపూడి, కర్తలి గ్రామాల్లో ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

జాతరలో దొంగల హల్‌చల్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో బుధవారం జరిగిన జాతరలో దొంగలు హల్‌చల్ చేశారు. కిక్కిరిసిన జనంలో కాశీబుగ్గకు చెందిన పోతనపల్లి చిన్నా అనే బాలుడు మెడలో బంగారు చైను, బంగారు బిళ్లను లాక్కుపోయారు. దీని విలువ సుమారు రూ.10 వేలపైన ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. పక్కనుంచి నడుస్తున్నట్లు వెళ్తూ కనిపించకుండా పోవడంతో లబోదిబోమన్నారు. దీనిపై కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావుకు సమాచారం అందించారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి హరిత

టెక్కలి: ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళా చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేకంగా మహిళా చట్టాలపై సదస్సులు నిర్వహించాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



కేశవరావు(ఫైల్)

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీ పాలవలస పేట సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొండ తెంబూరుకు చెందిన నాయుడుగారి కేశవరావు(48) బుధవారం మృతి చెందాడు. సోమవారం తన పొలం చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో కేశవరావు గాయపడ్డాడు. అతడిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య హైమావతి, వివాహం అయిన కుమార్తె, ఇద్దరు కుమారులు వినోద్ కుమార్, ఉమాపతి ఉన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులు, కన్వీనర్లు ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని విశ్వనాథపురం, నీలంపేట సచివాలయాల పరిధిలో గృహ సారథులు, కన్వీనర్లతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలపై చర్చించారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, పంకు సింహాచలం, కొండాల శిమ్మయ్య, మెట్ట సింహాచలం, మెట్టు వాసు, పట్నాన శివ, దాసరి శిమ్మయ్య, బానాల శశిభూషణరావు, తర్ర కామినాయుడు, సింగూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు పురస్కారం



నగదు పురస్కారం అందుకుంటున్న యోగిత

నందిగాం: మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వంజరాపు మీనాక్షి, గొల్లూరు యోగితలు కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఇచ్చే గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కారాలు అందుకున్నట్లు హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు తెలియజేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆ సంస్థ జోనల మేనేజర్ కీర్తికృష్ణ, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, మార్క్‌ఫెడ్ ఏడీ రమణలు నగదు బహుమతులు బుధవారం అందజేసినట్లు వెల్లడించారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు బి.రామారావు, ఎస్.ఇందిరాభాయ్, ఆర్.రామారావు, టి.ప్రసాదరావు, బి.రత్నం, డి.శ్రీనివాస్, వై.త్రినాథరావు, ప్రియదర్శినిలు అభినందించారు.

'ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించండి'



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు

సోంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ కోరారు. మండలంలోని సిరిమామిడి పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను స్వయంగా కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గురాల శ్రీను, బూత్ కమిటీ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, బారువ, సుంకిడి సర్పంచ్‌లు యర్ర రజనీ, శిలగాన భాస్కరరావు, పార్టీ నాయకులు కూర్మారావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అతివకు అండగా..

- వైఎస్సార్ చేయూత పథకంతో మహిళలకు ప్రభుత్వ సాయం
- టెక్కలి నియోజకవర్గంలో 66,186 మందికి లబ్ధి
- మూడు విడతల్లో రూ.124.09 కోట్ల సాయం

మండలాల వారీగా లబ్ధి వివరాలు

మండలం	లబ్ధిదారులు	మూడు విడతల్లో సాయం రూ. కోట్లలో..
టెక్కలి	16,127	రూ. 30.24
కోటబొమ్మాళి	17,944	రూ. 33.65
నందిగాం	14,397	రూ. 26.99
సంతబొమ్మాళి	17,718	రూ. 33.21



వైఎస్సార్ చేయూత సాయంతో తొలుసూరుపల్లిలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న అనసూయ

టెక్కలి: మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకానికి శ్రీకారం చుట్టారు. దిగ్విజయంగా మూడు విడతలుగా అక్క చెల్లెమ్మలకు సాయం అందజేస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఈ పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని 45 నుంచి 60 ఏళ్లలోపు వయసు కలిగిన మహిళలకు ఏటా 18,750 రూపాయలు సాయం అందజేస్తున్నారు. ఈ పథకం ద్వారా కిరాణా దుకాణాలు, గేదెలు, ఆవులు, మేకల యూనిట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. అమూల్, రిలయన్స్, పీ అండ్ జీ, ఐటీసీ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకుని లబ్ధదారులకు అవసరమైన సాయం అందజేస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు మరో వైపు ఏటా 18,750 రూపాయలు వైఎస్సార్ చేయూత సాయం అందుతుండడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు చిన్నపాటి వ్యాపారాలతో ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తున్నారు. చేయూత పథకంలో భాగంగా టెక్కలి నియోజకవర్గంలో మూడు విడతలుగా 66,186 మంది మహిళా లబ్ధిదారులకు సుమారు 124.09 కోట్ల రూపాయలను అందజేశారు.



వైఎస్సార్ చేయూత సాయంతో టెక్కలి మెయిన్ రోడ్‌లో నిర్వహిస్తున్న పెసర, మినుము తొక్కతీసే వ్యాపార దుకాణం

ఇంటి వద్దే కిరాణా దుకాణం



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 18,750 రూపాయల చొప్పున మూడు విడతల్లో సాయం అందింది. ఈ డబ్బులతో ఇంటి వద్దే కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకొని వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. మాలాంటి మహిళలకు చేయూత పథకం దన్నుగా నిలిచింది.

–జి.అనసూయ,
తొలుసూరుపల్లి, టెక్కలి మండలం

సద్వినియోగం చేసుకుంటున్నారు



వైఎస్సార్ చేయూత పథకాన్ని అర్హులైన మహిళా లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఎంతో మంచి ఆలోచనతో పథకాన్ని అమలు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని 45 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తున్నారు.

–జి.నారాయణరావు,
ఏపీఎం, టెక్కలి

'రేషన్ బియ్యం అందజేయండి'

టెక్కలి: పట్టణంలోని గొడగల కులస్తులకు ఫిబ్రవరి నెలకు సంబంధించి రేషన్ బియ్యం అందజేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి పద్మావతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. నిరుపేదలైన గొడగల కులస్తులకు రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.